స్కూళ్లు ఇలా... చదువులెలా?

విద్యా వ్యవస్థ గాడితప్పుతోంది..అస్తవ్యస్తంగా మారడంతో విద్యా ప్రమాణాలు దిగజారిపోతున్నాయి..సర్కారు బడులు మళ్లీ దుంపలబడులుగా మారిపోతున్నాయి..పేదింటి పిల్లలకు మెరుగైన విద్య దూరమవుతోంది. ఎగబాకిన ఆశలు మళ్లీ కింది పడిపోతున్నాయి..ప్రభుత్వం మారడంతోనే అధికశాతం విద్యార్థులు ప్రభుత్వ బడులను విడిచి ప్రైవేటుకు మారిపోయారు. ఇదే ధోరణి కొనసాగితే ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే అవకాశం అతి దగ్గరలోనే కనిపిస్తోంది.

- గాడి తప్పిన సర్కారు విద్య
- విద్యార్థుల సంక్షేమానికి కొత్త ప్రభుత్వం పాతర
- పేదింటి పిల్లలకు దూరమవుతున్న విద్య

కోటవురట్ల : మాజీ సీఎం జగన్ గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి ప్రభుత్వ పాఠశాలలకు ఓ క్రేజ్ తీసుకొచ్చారు. పేద పిల్లలు మాది దుంపలబడి కాదు, కార్పొరేట్ స్కూల్ అని గర్వంగా చెప్పుకొనేలా ప్రభుత్వ పాఠశాలల్లో మార్పు తీసుకొచ్చారు. ఇంగ్లిషు మీడియంపై పట్టు సాధించేలా టోఫెల్ వంటి ఉన్నత ప్రమాణాలు కలిగిన బోధనను అందించారు. ఐదేళ్లూ పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ క్రమం తప్పకుండా తల్లుల అకౌంట్లలో అమ్మ ఒడి నగదు జమచేశారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపి ఉపాధ్యాయులను పరుగులు తీయించారు. పాఠశాలలు తెరిచిన మొదటి రోజునే 9 వస్తువులతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లు అందించేవారు. ఇదంతా ఓ గతం..ఇపుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పాఠశాలలు తెరిచి రెండు నెలలు కావస్తున్నా పూర్తి స్థాయిలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందలేదు. పూర్తి స్థాయిలో పుస్తకాలు లేకపోవడంతో సర్దుబాటు చర్యలు తప్పలేదు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగా తగ్గిపోవడంతో ఏకోపాధ్యాయులే దిక్కయ్యారు. ఐదు తరగతుల పిల్లలను ఒకే గదిలో కూర్చోపెట్టి పాఠాలు బోధించాల్సిన దుస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో రాజకీయం నీడ పడకుండా వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి కఠినంగా వ్యవహరించారు. పిల్లలు రాజకీయం లేని ప్రశాంత వాతావరణంలో విద్యను అభ్యసించేలా వ్యవస్థను రూపొందించారు. మెరుగైన బోధన ఉండేలా ఉపాధ్యాయులను ఓ గాడిలో పెట్టారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రభుత్వ పాఠశాలల్లో మళ్లీ రాజకీయం చొరబడింది. తెలుగు తమ్ముళ్లు అన్నింటా తామే నంటూ పుస్తకాల పంపిణీలో సైతం తల దూరుస్తున్నారు. అధికారులు కూడా ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి తెలుగు తమ్ముళ్లతోనే పుస్తకాల పంపిణీ నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రశాంత వాతావరణంలోకి భయానక పరిస్థితులను తీసుకొచ్చింది.

సంక్షేమం తిరోగమనం

తల్లికి వందనం (అమ్మ ఒడి) నగదు నేటికీ తల్లులకు అందలేదు. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలను చదివిస్తున్న పేదలు ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 245 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గత ఏడాది 21,100 విద్యార్థులు ఉండేవారు. కూటమి ప్రభుత్వం రావడంతో విద్యార్థుల సంఖ్య 20,408 కి పడిపోయింది.

ఏకోపాధ్యాయ పాఠశాలలే..

నక్కపల్లి మండలంలో 17, కోటవురట్ల మండలంలో 14 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. 15 **మందికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున నక్కపల్లి మండలంలో 138 మంది ఉపాధ్యాయులు, కోటవురట్ల మండలంలో 108 ఉపాధ్యాయులు ఉన్నారు. చాలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో అన్ని తరగతుల విద్యార్థులను కలిపి ఒకే గదిలో కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. కూటమి** ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదే ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్ని మార్పులు చోటు చేసుకోగా రానున్న నాలుగేళ్లలో ప్రభుత్వ పాఠశాలలు చాలా వరకు మూతపడే అవకాశం కనిపిస్తోంది. మొత్తం పాఠశాలలు ఏకోపాధ్యాయులుగా మారిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

సబ్జెక్టు టీచర్ల కొరత..తగ్గిన విద్యార్థుల సంఖ్య

అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరం ఎలిమెంటరీ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు. దీంతో ఒక ఉపాధ్యాయుడ్ని వేరొక చోటకి సర్దుబాటు చేశారు. అదే మండలంలోని అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో 748 మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య 33. గత ఏడాది అచ్యుతాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 4,4461. ఈ యేడాది విద్యార్థుల సంఖ్య 4,077. ఇవీ ప్రస్తుత ప్రభుత్వ విద్యా విధానంలో మారిన స్థితిగతుల గురించి కొద్ది పాటి ఉదాహరణలు. ప్రభుత్వం అందించాల్సిన అమ్మఒడి పేరు మార్చి తల్లికి వందనం ప్రకటించారు. కానీ విద్యార్థులకు ఎటువంటి లబ్ధి లేదు. చాలా చోట్ల స్టూడెంట్స్ కిట్స్‌లో సైజులు సరిపోలడం లేదు. మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలల్లో 243 మంది సిబ్బంది పని చేస్తున్నారు. చాలా చోట్ల ఉన్నత పాఠశాలల్లోనూ, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది.

ఎఫ్1 పరీక్షల వాయిదా

ఈ ఏడాది ఆగస్టు నెల మొదటి వారంలో జరగాల్సిన ఎఫ్ 1 పరీక్షలు నెలాఖరుకి వాయిదా వేశారు. ఇంతలో అందరి దృష్టి పాఠశాల యాజమాన్య కమిటీల పడింది. ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న గందరగోళ పరిస్థితుల్లో పేరు మార్చిన పాఠశాల అనుబంధ పథకాల మార్పుతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల పరిస్థితి విద్యార్థుల సంఖ్య బట్టి చూస్తే అర్థమవుతోంది.



చినబొడ్డేపల్లిలో ఐదు తరగతుల విద్యార్థులకు ఒకే గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తల్లికి వందనం కోసం ఎదురు చూస్తున్నాం..



కూటమి ప్రభుత్వం.. తల్లికి వందనం పథకంతో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు చొప్పున డబ్బులు వేస్తామన్నారు. పాఠశాలలు తెరిచి రెండు నెలలు అవుతున్నా ఆ ఊసేలేదు. తొందరగా ఆ డబ్బులు వేస్తారని ఆశపడుతున్నాం. నాకు ఇద్దరు పిల్లలు, పెదబాబు పదోతరగతి, చినబాబు ఆరోతరగతి చదువుతున్నారు. ఇద్దరికీ కలిపి రూ.30 వేలు వేయాలి.

– మాకిరెడ్డి లోవకుమారి, కె.వెంకటాపురం

రాజకీయం చేస్తున్నారు



గతంలో జగన్ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు బాగా అభివృద్ధి చెందాయి. క్రమం తప్పకుండా అమ్మఒడి నిధులు పడేవి. ఇపుడా పరిస్థితి లేదు. ఇంకా తల్లికి వందనం డబ్బులు వేయలేదు. ప్రశాంతంగా ఉండే ప్రభుత్వ పాఠశాలల్లోకి రాజకీయం చేరింది. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా మాత్రమే విద్యా కానుక కిట్లు, పుస్తకాలు అందేవి. ఇపుడు ప్రజా ప్రతినిధులు ఉన్నా వారిని పక్కన పెట్టి కూటమి నాయకులతో పంపిణీ చేయిస్తున్నారు.

– టి.రామసత్యనారాయణ, కె.వెంకటాపురం

విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది



ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం మారాక సదుపాయాలు పూర్తిగా మారిపోయాయి.. నాణ్యమయిన భోజనం అందివ్వడంలేదు, సకాలంలో పుస్తకాలు, జగనన్న కిట్లు ఇవ్వలేదు..ఇంగ్లిష్ మీడియం బోధన తొలగించడం వల్ల విద్యార్థుల సంఖ్య 138 నుంచి 68 కి పడిపోయింది. గత ప్రభుత్వంలో అన్ని సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమయిన విద్య అందించే వారు ఇపుడు ఆ పరిస్థితి లేదు

–అల్లు ఏసుబాబు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్, పెట్టుగోళ్లపల్లి, ఎస్.రాయవరం మండలం

సంఘ అభివృద్ధికి సహకారం అందిస్తా



మునిలితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న బొడ్డేడ కుటుంబీకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

- బొడ్డేడ కుటుంబీకుల ఆత్మీయ సమావేశంలో బొడ్డేడ ప్రసాద్

మునగపాక:మునగపాకకు చెందిన బొడ్డేడ కుటుంబ సభ్యులు ఆదివారం మునిలితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసిన ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. పిల్లా పాపలతో కలిసి బొడ్డేడ కుటుంబ సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి పండుగ వాతావరణంలో కలుసుకోవడం సంతోషకరమన్నారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుగా ఉండాలని సూచించారు. అలాగే సంఘ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు.అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి మునిలితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొడ్డేడ రామారావు, పెద్దలు బొడ్డేడ రామునాయుడు,శివ, ఈశ్వరరావు, జగ్గారావు. సోమరాజు, వెంకటరావు , అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల్లో పూడికలు తీయాలి



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి మాధవరావు

మునగపాక : శారదానదిలో పూడికలు తీయించి రైతాంగానికి మేలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మళ్ల మాధవరావు కోరారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ముందుగా కేరళలోని వయనాడలో సంభవించిన వరదల భీభత్సానికి మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీటి కాలువల్లోని ఆక్రమణలు తొలగించి రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. అలాగే మునగపాక, నాగులాపల్లి, ఒంపోలు, అరబుపాలెం ఉమ్మలాడ తదితర గ్రామాల్లోని రైతు సంఘాలతో కలిసి సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం చేయాలని నిర్ణయించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దొరబాబు,సీపీఐ నేతలు పెంటకోట సత్యనారాయణ, దాడి శివరాం, నరాలశెట్టి సత్యనారాయణ, జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి



ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం అందజేస్తున్న జోగప్పలనాయుడు సోదరులు

మునగపాక : ప్రతి ఒక్కరూ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో నూతనంగా రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా మునగపాకకు చెందిన పెంటకోట వెంకట జోగప్పలనాయుడు, స్వామి సత్యనారాయణ సోదరులు ఆదివారం రూ.50వేల విరాళం కమిటీ చైర్మన్ ప్రసాద్‌కు, సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమవంతు సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో పెద్దలు సూరిశెట్టి రాము, ఆడారి అచ్చియ్యనాయుడు, పెంటకోట ఉమేష్, దాడి మునిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, వెలగా శ్రీనివాసరావు, విల్లూరి నూక నరసింగరావు, ఆడారి రాజు, కాండ్రేగుల జగ్గారావు, అలంక ప్రకాశరావు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ



సత్యనారాయణ కొండ వద్ద వివిధ రకాల విత్తన బంతులతో గ్రీన్ క్లబ్ సభ్యులు

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ అన్నారు. మండలంలోని సత్యనారాయణపురం సత్యనారాయణస్వామి కొండ సమీపంలో గ్రీన్‌క్లబ్, విశాఖ గ్రీన్ క్లైమేట్ అండ్ వనమాలి గార్డెనర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యులంతా వేర్వేరు చోట్ల 2 వేల విత్తన బంతుల్ని విసిరారు. ఈ సందర్భంగా ఫణిభూషణ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం బంకమట్టి, సేంద్రియ ఎరువు మిశ్రమంలో ఉసిరి, వేప, నేరేడు, పనస, చింత, అశోక, సపోటా తదితర విత్తనాలను కలిపి వెదజల్లినట్లు తెలిపారు. మొక్కలను నాటి వాటి పర్యవేక్షణను కూడా బాధ్యతగా తీసుకోవాలన్నారు. పోషకాలు అధికంగా ఉండే మట్టిలో విత్తనాలను పెట్టడం వలన బతికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

మూడు లారీలు, పొక్లెయిన్ స్వాధీనం

మునగపాక : ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మునగపాకలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న లే–అవుట్‌లకు సంబంధించి అనుమతులు లేకుండా శనివారం రాత్రి గ్రావెల్ తరలిస్తున్న మూడు లారీలతో పాటు పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మైన్స్ అధికారులకు వాహనాలు అప్పగించి కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎస్.రాయవరం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య చర్యలు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో ఆదివారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామ అంబాసిడర్లు పలు వీధుల్లో చెత్తను తొలగించి, డ్రైనేజీలలో పూడికలు తీశారు. 10, 11 వార్డుల్లోని డ్రైనేజీలలో బ్లీచింగ్ చల్లారు. సర్పంచ్ శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్యం మెరుగుకు సహకరించాలని కోరారు.

నేటి నుంచి కోటి కుంకుమార్చన

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి కోటి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు యద్ర త్రినాథరావు, ధర్మకర్త బోయిన రమణాజీలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు భక్తులచే ఈ కుంకుమార్చన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. శ్రావణమాసం నాలుగు వారాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

బీమాతో కుటుంబ ఆర్థిక పురోగతి



ఎల్ఐసీ కార్యాలయంలో మొక్కను నాటుతున్న కర్రి హరగోపాల్

అనకాపల్లి: జీవిత బీమా ఆర్థిక ఎదుగుదలతోపాటు, కుటుంబానికి అత్యవసర సమయాల్లో ఎంతో ఆసరాగా ఉంటుందని జాతీయ బీమా కార్మిక సంఘం(ఎన్ఐవోడబ్ల్యూ) జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు బొడ్డేడ అప్పలనరసయ్య అన్నారు. స్థానిక ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలో జాతీయ బీమా కార్మిక సంస్థ 56వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఎల్ఐసీ అనకాపల్లి శాఖ అసిస్టెంట్ మేనేజర్ కర్రి హరగోపాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థ అభివృద్ధి కోసం కార్మికులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్‌మెంట్ పెన్షన్‌తో పాటు, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవుల్ని మూడు మాసాల నుంచి ఆరు మాసాలకు పెంచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ బీమా కార్మిక సంఘం నాయకులు ఎం.జగదీష్, కేవీ శ్రీనివాస్, ఏజెంట్లు పాల్గొన్నారు.

స్కూల్‌కమిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ప్రసాద్



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు,ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు

మునగపాక : ఈ నెల 8న జరగనున్న స్కూల్ కమిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. ఆదివారం బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలపరిమితికి సంబంధించి జరిగే ఎన్నికలను ప్రతి ఒక్కరూ సవాల్‌గా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులతో తరచూ సమావేశాలవుతూ ఎన్నికల్లో గెలిచేందుకు పాటుపడాలన్నారు. అలాగే పార్టీపరంగా ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానన్నారు. గత ఎన్నికల్లో వచ్చిన తీర్పుకు చింతించకుండా ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మళ్ల సంజీవరావు, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, చదరం నాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, గంగప్పలనాయుడు, కారుకొండ వెంకట్ రాజు, దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, సుందరపు తాతాజీ, దొడ్డి సూరప్పారావు, మండల పరిషత్ మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా సత్యనారాయణ, పార్టీ నేతలు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, టెక్కలి కొండలరావు, షేక్ ఇస్మాయిల్, బొడ్డేడ చెల్లయ్యనాయుడు, కాండ్రేగుల జగన్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, కాండ్రేగుల వెంకటలక్ష్మి, కాండ్రేగుల కిరణ్‌కుమార్, ఇల్లా శిరీషా నాగేశ్వరరావు, మద్దాల వీరునాయుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పెంటకోట హరేరామ సమావేశంలో పాల్గొన్నారు.

మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షునిగా నూకరాజు



నూకరాజు,తాతాజీలను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షునిగా వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఎన్నికయ్యారు. ఆదివారం మునగపాక బొడ్డేడ క్యాంప్ కార్యాలయంలో సంఘ నూతన కార్యవర్గం ఎంపికైంది. సంఘ అధ్యక్షునిగా నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా సుందరపు తాతాజీ(వెంకటాపురం), ఉపాధ్యక్షునిగా చదరం గణేష్‌నాయుడు(గణపర్తి), కార్యదర్శిగా అయినంపూడి విజయభాస్కరరాజు(మెలిపాక),సహాయ కార్యదర్శులుగా భీశెట్టి గంగప్పలనాయుడు(మూలపేట),కారుకొండ వెంకటి(నారాయుడుపాలెం),కోశాధికారిగా దిమ్మల అప్పారావు(మునగపాక),సభ్యులుగా పాలిపిని రమణమ్మ,ఇందల హేమలతలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ శాలువాతో కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాలకవర్గ సభ్యులు పాటుపడాలన్నారు. సర్పంచ్‌లంతా ఐక్యంగా ఉండి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో పలువురు సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



గణపర్తి లో స్నేహితుల దినోత్సవం సందడి

మునగపాక : మండలంలోని గణపర్తి శ్మశానవాటికలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన దుంగల అప్పారావు అలాగే వేపచేదుల అప్పారావు స్నేహితులు. ఇరువురు 2022లో మూడు నెలల వ్యవధిలో మృతిచెందారు. దీంతో వారి జ్ఞాపకార్థం నాటి నుంచి ఏటా గణపర్తి శ్మశాన వాటికలో స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా స్నేహితుల సమక్షంలో దినోత్సవాన్ని జరుపుకొన్నారు. వారితో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గణపర్తి బాలాజీ నగర్‌కు చెందిన యూత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధ్వానంగా సాగునీటి కాలువ



ఉమ్మలాడలో అధ్వానంగా దర్శనమిస్తున్న సాగునీటి కాలువ

మునగపాక: మండలంలోని పలు ప్రాంతాల్లో సాగునీటి కాలువలు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. కేవలం సాగునీటి కాలువల ఆధారంగా పంటలు సాగించే రైతులు అధికారుల తీరు పట్ల విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మలాడ,నాగులాపల్లి,ఒంపోలు, మునగపాక,తోటాడ, రోలుగెడ్డ తదితర సాగునీటి కాలువలు స్వరూపాన్ని కోల్పోతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాలువల్లో మురుగునీరు వచ్చేయడం, తుప్పలు పేరుకుపోవడం వంటి కారణాలతో సాగునీటి కాలువలను చూసి రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి కాలువల అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

గంగాలమ్మతల్లి గుడి నిర్మాణానికి విరాళం



గుడి నిర్మాణానికి విరాళం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక: మండలంలోని మూలపేటలో నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి గుడికి దాతలు తమ వంతు విరాళం అందజేస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మునగపాకకు చెందిన స్వర్గీయ డాక్టర్ పెంటకోట జోగినాయుడు కుమారులు జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, అతని సోదరుడు వెంకట జోగి అప్పలనాయుడులు రూ.10,155 నగదు అందజేశారు.సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు,కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు



సోమిదేవపల్లి గ్రామంలో మట్టి తవ్వకాలు చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : వీకెండ్ వస్తే అక్రమ గ్రావెల్, మట్టి తవ్వకం దారులు నూతన ఉత్సాహం వస్తుంది. మండలంలో పెనుగొల్లు శివారులు సోమిదేవపల్లి, జీవీపాలెం తదితర గ్రామాల్లో శని,ఆదివారాల్లో పెద్ద ఎత్తున అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేశారు. ఈ రావాణా చూసి స్థానికులు అధికారులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చినప్పటికి అధికారులు ఇటువైపు చూడలేదు. దీంతో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి, గ్రావెల్ తరలించుకుపోయారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్న ప్రదేశాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శిష్టకరణాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారం



విద్యార్థులకు మెమెంటో, స్కాలర్ షిప్‌లు అందిస్తున్న అతిథులు

పాయకరావుపేట : దేశంలో శిష్టకరణాల కులస్తులకు చెందిన 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నట్టు ఆల్ ఇండియా శిష్టకరణాల అసోషియేషన్ అధ్యక్షుడు డి.వి. కృష్ణారావు అన్నారు. పట్టణంలో గల తుని, పాయకరావుపేట శిష్టకరణాల సంఘం అధ్యక్షులు ఎస్.ఎస్.పట్నాయక్ గృహం వద్ద సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది 10 వ తరగతి విద్యార్థులకు, 95 శాతం మార్కులు దాటిన వారికి శిష్టకరణాల విద్యార్థులకు 10 వేల రూపాయలు చొప్పున నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో శిష్టకరణాల రాష్ట్ర అధ్యక్షుడు పి.ఉమామహేశ్వరరావు, విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టు ఎండీ యు.జె.ఎం రావు తదితరులు పాల్గొన్నారు.

